సాక్షి
నిర్మల్
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024


వేదికపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు వెంకట్‌రెడ్డి, సీతక్క, సురేఖ, శ్రీధర్‌బాబు, నాగేశ్వర్‌రావు, నేతలు మధుయాష్కీగౌడ్, షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి

కాంగ్రెస్ శంఖారావం


కంకణం కడుతున్న సీతక్క


ప్రసంగిస్తున్న సీఎం రేవంత్

- నాగోబాను మొక్కి.. ఎన్నికల గంట మోగించిన సీఎం
- 'లోక్‌సభ'కు సిద్ధమంటూ ఇంద్రవెల్లి గడ్డ నుంచి ప్రకటన
- ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం
- ఇంద్రవెల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జిల్లాకు తరలివచ్చిన మంత్రివర్గం
- సభ సక్సెస్‌తో శ్రేణుల్లో ఉత్సాహం


ఇంద్రవెల్లిలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం

సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్: లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ శంఖారావం పూరించింది. ఇంద్రవెల్లి గడ్డ నుంచే ఈ ఎన్నికలకు సిద్ధమని ప్రకటించింది. సీఎంతో పాటు మంత్రివర్గం జిల్లాకు తరలివచ్చింది. తెలంగాణ పునర్నిర్మాణ సభ పేరిట ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సమీపంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభ సక్సెస్ అయింది. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి పథంవైపు తీసుకెళ్తామని హస్తం సర్కార్ భరోసానిచ్చింది. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో, కేంద్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు వ్యవహరించిన తీరుపై సీఎం తీవ్రంగా విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే ఢిల్లీలో తాకట్టు పెడతారని, మోదీకి గులాంగిరి చేస్తారని విమర్శించారు. అలాగే గతంలో బీజేపీ ఎంపీలను గెలిపించినప్పటికీ ఈ ప్రాంతం కోసం చేసిందేమి లేదన్నారు. కనీసం ఎంపీ సోయం బాపూరావుకు మంత్రి పదవి అయినా ఇచ్చిందా అని ప్రశ్నించారు. మతం పేరిట బీజేపీ, మద్యంతో బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో ఒక్కటై వస్తున్నారని విమర్శించారు. సీఎం పర్యటనలో భాగంగా ముందుగా మెస్రంవంశీయుల ఆరాధ్యదైవమైన నాగోబాను దర్శించుకున్నారు.

నాగోబా ఆలయంలో పూజలు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ మెస్రం వంశీయులు తమ సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. సీఎంకు తెల్లటి తలపాగా చుట్టారు. గర్భగుడిలో నాగోబాను దర్శించుకున్నారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు. అనంతరం రూ.6 కోట్ల ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ స్టాళ్లను సందర్శించారు. గిరిజన దర్బార్ వేదికలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. రూ.50 కోట్ల విలువ గల బ్యాంకు లింకేజీ చెక్కులు పంపిణీ చేశారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లకు ఒక్కో గ్రూపునకు రూ.25 లక్షల చొప్పున మంజూరు చేశారు. రూ.60 కోట్లతో 862 గ్రామాలకు తాగునీటి సౌకర్యం, రూ.27.20 కోట్లతో 33 గిరిజన సంక్షేమ రోడ్లకు, రూ.5 కోట్లతో బుగ్గారంలో గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి, రూ.5 కోట్లతో ఇంద్రవెల్లిలో గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడినుంచి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. స్మృతి వనానికి భూమి పూజ చేశారు. ఆ తర్వాత తెలంగాణ పునర్నిర్మాణ సభకు 4.40 గంటలకు చేరుకున్నారు. ఈ టూర్‌లో భాగంగా సీఎం జిల్లాలో సుమారు మూడున్నర గంటల పాటు ఉన్నారు.

తరలివచ్చిన మంత్రివర్గం..

ఇంద్రవెల్లి సభకు సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రివర్గం తరలివచ్చింది. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన సభ నిర్వహించగా.. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, సీతక్క, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, వివేక్, వినోద్, వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, సీనియర్ నాయకులు వీహెచ్, మల్లు రవి, బలరాం నాయక్, మాజీ ఎంపీ రాజయ్య, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అంజన్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సీఎం సభకు రాకముందు పలువురు నేతలు ప్రసంగించారు. సీఎం వేదికపైకి చేరుకున్న తర్వాత మొదట స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఆ తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క ప్రసంగించారు. చివరలో సీఎం ప్రసంగం కొనసాగింది.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి భరోసా..

ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని సీఎం భరోసానిచ్చారు. తుమ్మిడిహెట్టి, సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులు నిర్మిస్తామని, కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. తండాలు, గూడేలకు రోడ్లు, తాగునీరు కల్పిస్తామని వివరించారు. 1981లో సమైక్య ఆంధ్ర పాలనలో కాంగ్రెస్ సర్కార్ హయాంలోనే ఇంద్రవెల్లి ఘటన చోటుచేసుకున్నందుకు తాను క్షమాపణ చెబుతున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని వివరించారు. ఆదివాసీలను గుండెల్లో పెట్టుకొని చూస్తామన్నారు. ట్రైకార్ కింద సంక్షేమ నిధులు అందించి ఆదుకుంటామని వివరించారు.

శ్రేణుల్లో ఉత్సాహం

సభ సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని సీఎం సూచించారు. సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తల నుంచి మంచి స్పందన లభించింది.

స్వయం సహాయక సంఘాలకు పూర్వ వైభవం..

- పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థుల యూనిఫాం కుట్టు పని 'పొదుపు' గ్రూపులకు ఇస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి


రంజన్ల తయారీ స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఇంద్రవెల్లి: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాలఆత్మీయ సమావేశానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెస్రం వంశీయులు సీఎంను శాలువాతో సన్మానించి, నాగోబా ప్రతిమను బహూకరించారు. ఆలయంలో రూ.5 కోట్ల నిధులతో నిర్మించిన గోపురాలు, ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.38.20 కోట్ల నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మంత్రులు వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, కొండా సురేఖ, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి ప్రారంభించారు. ఆలయంలో మరింత అభివృద్ధి కోసం మరో రూ.6 కోట్ల నిధులు మంజూరు చేస్తామని మెస్రం వంశీయులకు సీఎం హామీ ఇచ్చారు. అక్కడి నుంచి నాగోబా దర్బార్ హాల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల సభ్యులు సీఎంకు స్వాగతం పలికారు. వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం సమావేశంలో పలువురి మహిళల అభిప్రాయాలు తెలుసుకున్నారు. గుర్తించిన 15 మంది అమరవీరుల కుటుంబీకులకు ఇంటి స్థలాల హక్కు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. మహిళలకు అండగా నిలిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. త్వరలోనే ప్రియాంకగాంధీ చేతుల మీదుగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ఆకాంక్ష అని అన్నారు. అర్హులందరికీ త్వరలోనే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. పాఠశాల, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల యూనిఫాం కుట్టుపనిని స్వయం సహాయక సంఘాలకే ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అడ్డుకోవాలని కొందరు కుట్ర చేస్తున్నారని, అలాంటి వారు ఊర్లలోకి వస్తే తగిన బుద్ధి చెప్పండని సూచించారు. అక్కడి నుంచి అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. రూ.కోటితో స్మృతి వనం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అమరవీరుల 15 కుటుంబాలకు ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలాం, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో పాటు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, సర్పంచ్ రేణుకానాగ్‌నాథ్, మెస్రం వంశీయులు తదితరులున్నారు.

తెలంగాణ దోపిడీకి గురైంది



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లు కొంత మంది చేతుల్లో దోపిడీకి గురైంది. వనరులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం దోచుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఇంద్రవెల్లి నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ఈ ప్రాంత హక్కులను కాపాడుతాం. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉంటాం. గద్దర్ పేరిట కళాకారులకు సినీ అవార్డులు అందజేస్తాం. ఐటీడీఏ పునరుద్ధరణకు చర్యలు చేపడతాం. చిక్‌మన్, త్రివేణి సంగమం ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. స్వయం సహాయక సంఘాలకు అండగా నిలబడతాం.

– మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

ప్రజల పక్షాన నిలబడతాం



కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు ప్రజల పక్షాన ఉండి సమస్యలను పరిష్కరిస్తాం. నిరుపేదలకు కూడు, గుడ్డ అందించేలా చర్యలు చేపడతాం. ఉమ్మడి జిల్లా పరిధిలో అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంచినీళ్ల కోసం జనం ఇబ్బందులు పడుతున్నారు. వాటి పరిష్కారానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుంది. రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ ప్రజల పక్షాన ఉంటుంది.

– సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి


గత ప్రభుత్వం పట్టించుకోలేదు



అభివృద్ధిలో జిల్లా వెనుకబడింది. విద్య, వైద్యం, వ్యవసాయం గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయంతో పాటు నర్సింగ్, హార్టికల్చర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి. సదర్‌మాట్ కెనాల్, కడెం ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలి. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య పోస్టులు భర్తీ చేయాలి. జీవో నం.317తో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.. ఆ సమస్య పరిష్కరించాలి. ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించి నియామకాలు చేపట్టాలి. ప్రతి గ్రామం, గూడేలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. అలాగే పోడు భూముల సమస్యలను పరిష్కరించాలి.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

ఉమ్మడి జిల్లాకు నిధులు పెంచాలి



రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ప్రభుత్వం రెండింటిని అమలు చేస్తుంది. మిగతావి కూడా త్వరలోనే అమలు చేసేందుకు సీఎం చర్యలు చేపడుతున్నారు.

– ప్రేమ్‌సాగర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల


అమరవీరుల కుటుంబీకులకు ఇంటి స్థలం హక్కు పత్రాలను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


సభలో కళాకారుల ఆటాపాట


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


సీఎంకు కుమురంభీం చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూస్‌రీల్

'గుండెగాం'కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్: ముంపు గ్రామమైన గుండెగాం నిర్వాసితులు తాత్కాలికంగా ఆశ్రయం పొందుతున్న భైంసా పట్టణంలోని డబుల్‌బెడ్రూం గృహ సముదాయానికి శుక్రవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రెండేళ్లుగా కరెంట్ బిల్లు చెల్లించలేదని అధికారులు కనెక్షన్ తొలగించగా 'కరెంట్ బిల్లు చెల్లించేదెవరు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీఎండీ వరుణ్‌రెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు భైంసా ఏడీఈ ఆదిత్య తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి గుండెగాం నిర్వాసితులు ధన్యవాదాలు తెలిపారు.

సీఎస్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు


సీఎస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రానికి వచ్చిన సీఎస్ శాంతికుమారిని టీఎన్జీవోస్ నాయకులు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల ఒకటో తేదీన జీతాలు వచ్చినందుకు టీఎన్జీవో సంఘం తరఫున ఆమెకు కృతజ్ఞతలు చెప్పారు. ఉద్యోగుల పెండింగ్ బిల్స్, ఇతర సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్‌ను కలిసిన వారిలో టీఎన్జీవో అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, కార్యదర్శి కుడాల రవికుమార్, ఉపాధ్యక్షుడు జవాదు హుస్సేన్, నిర్మల్‌టౌన్ కార్యదర్శి బీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఎస్.మోహన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కే అరుణ్ ఉన్నారు.

రేపు టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ ప్రవేశ పరీక్ష

భైంసాటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సీవోఈ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు భైంసా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నిర్మల్‌రోడ్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో 'సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, భైంసా ఎట్ బాసర్' అని ఉన్నవారు భైంసాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (ఓల్డ్ సరస్వతి కాలేజ్) దగ్గరికి రావాలని తెలిపారు. హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్, బ్లాక్ పెన్‌తో గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో వివరాలు తప్పుగా ఉంటే సంబంధిత ఆధారాలతో హాజరు కావాలని, వివరాలకు 79950 10575, 96422 00405 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎస్సెస్సీ పరీక్షలపై సమీక్షా సమావేశం

నిర్మల్ రూరల్: మార్చిలో నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలపై శనివారం కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు సమీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. తమ వెంట ప్రధానోపాధ్యాయులు పదోతరగతి విద్యార్థుల ఎఫ్ఏ-1, 2, 3, 4, ఎస్ఏ-1, 1 రిజల్ట్స్‌ను (సబ్జెక్టుల వారీగా.. ఓవరాల్ కన్సాలిడేషన్ ఏ, బీ, సీ, డీ ల వారీగా) ప్రధానోపాధ్యాయులు వెంట తీసుకురావాలని సూచించారు.

జాతీయస్థాయి యోగాలో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్: జాతీయస్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థులు రాణించడం అభినందనీయమని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో భైంసాకు చెందిన జె.స్పందన, జె.నమ్రత, జె.మహేశ్, విగ్నేశ్, దినేశ్, బాలాజీ, అచ్యుతానంద్ పాల్గొని పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. శుక్రవారం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో వీరిని అభినందించారు. యోగా మాస్టర్ రవీందర్, మాధవరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లోగల అల్ఫోర్స్ ఉన్నతపాఠశాల విద్యార్థులు రగ్బీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం విద్యాసంస్థల చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రామకృష్ణ, రోహన్‌సింగ్, అనిశ్, హిమవర్షిని, దర్శిని, భక్తి, మైరాజబీన్, మధూష, మనూష ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

నిర్మల్‌ఖిల్లా: నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాల సాధనలో ముందుంటారని టీఎస్‌కేసీ రిసోర్స్‌పర్సన్ ఎండీ.అబ్దుల్ ముతిక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యంలో 'క్యాంపస్ టు కార్పొరేట్ కనెక్ట్' పేరిట ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు ఉంటేనే కార్పొరేట్ రంగంలో రాణిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో ఇలాంటి నైపుణ్యాలు పెంపొందించడం వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జే భీమారావు, టీఎస్‌కేసీ సమన్వయకర్త శంకర్, మెంటర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాసరకు రావాలని ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు బాసరలో నిర్వహించనున్న వసంత పంచమి వేడుకలకు హాజరు కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను స్థానాచార్యులు, అధికారులు కోరారు. శుక్రవారం నిర్మల్‌లో ఆహ్వానపత్రిక అందజేశారు.

ఎంపీని కలిసిన రైల్వే కమిటీ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎంపీ సోయం బాపూరావును ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ జిల్లా కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈసవేణి మనోజ్‌యాదవ్ శుక్రవారం ఢిల్లీలో కలిశారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కోకన్వీనర్లు యాటకారి సాయన్న, మూర్తి ప్రభాకర్, నిమ్మ గణేశ్, సయ్యద్ చాంద్ పాషా తదితరులున్నారు.

'బండి'ని కలిసిన..

నిర్మల్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ను శుక్రవారం న్యూఢిల్లీలో ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. బండిని కలిసినవారిలో కన్వీనర్ మనోజ్‌యాదవ్, కో కన్వీనర్లు యాటకారి సాయన్న, మూర్తి ప్రభాకర్, నిమ్మ గణేశ్, సయ్యద్ చాంద్‌పాషా తదితరులున్నారు.

అత్యవసర పరిస్థితులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

దస్తురాబాద్: అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి.. ఆకస్మిక వరదలు వస్తే సురక్షిత ప్రాంతాలకు ఎలా వెళ్లాలి.. అనే అంశాలపై గోదావరి తీర ప్రాంతాలైన మండలంలోని గోడిసీర్యాల, భూత్కూర్, మున్యాల గ్రామాల ప్రజలు, విద్యార్థులకు శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలతో ఆకస్మికంగా వరదలు, భూకంపాలు వచ్చినపుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు అత్యవసర పరిస్థితుల్లో ముందుకు వచ్చి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వరదలు వచ్చినపుడు, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు, భూకంపాల సమయంలో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ పింటు నంది, టీం సభ్యులు అనిల్, ప్రవీణ్, ఉపేందర్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, ఆర్ఐ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

'వడ్యాల్'కు సరస్వతి నీళ్లు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ చెరువులోకి సరస్వతి కాలువ నీళ్లు వస్తున్నాయి. రెండ్రోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. వడ్యాల్ సర్పంచ్ లలితారెడ్డి చెరువులోకి సరస్వతి కాలువ ద్వారా నీళ్లు నింపేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన మహేశ్వర్‌రెడ్డి వడ్యాల్–రాచాపూర్ గ్రామాల మధ్య చెరువు నింపాలని అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం వడ్యాల్ వద్ద సరస్వతి కాలువపై గల ఎస్కేప్ వద్ద గేట్ కిందికి దింపి వడ్యాల్–రాచాపూర్ చెరువులోకి నీళ్లు నింపుతున్నారు. దీంతో ఇరు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దస్నాపూర్‌ కాలనీలోని సాగర్‌ సూపర్‌ మార్కెట్‌ ఎదుట గైక్వాడ్‌ శైలనంద్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సాగర్‌ సూపర్‌ మార్కెట్‌ ఎదుట శైలనంద్‌ తన ద్విచక్ర వాహనం పార్కింగ్‌ చేసి షాపింగ్‌కు వెళ్లాడు. కొద్దిసేపటికీ తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మంత్రికి సెల్యూట్‌ చేసిన పోలీసు జాగిలం



ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు పోలీసు జాగిలం గౌరవ వందనం చేసింది. శుక్రవారం ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన సభకు మంత్రి సీతక్క హాజరు కాగా ఓ పోలీసు జాగిలం గౌరవ వందనం చేసింది.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్‌: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన పట్టణ టూ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్‌ వివరాల ప్రకారం.. పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన పట్క్యూటవార్‌ పోశెట్టి(70) అదే కాలనీలో నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాలనీలోని హనుమాన్‌ టెంపుల్‌ ప్రాంతంలో ఓ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు పి.పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జోనల్‌ స్థాయి వెయిట్‌ లిఫ్టింగ్‌ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని లిటిల్‌ స్టార్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్‌–17 బాల, బాలికల జోనల్‌ స్థాయి వెయిట్‌ లిఫ్టింగ్‌ ఎంపిక పోటీలు నిర్వహించారు. స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించడగా ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 3, 4, 5వ తేదీలలో కరీంనగర్‌లో నిర్వహించే స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్‌ కమలాకర్‌ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్‌ కార్యదర్శి రాజేష్‌, జిల్లా వెయిట్‌ లిఫ్టింగ్‌ కార్యదర్శి జ్యోతిశ్వరన్‌ పాల్గొన్నారు.

పేస్కేల్‌ అమలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్‌: ఈజీఎస్‌ ఫీల్డ్‌ అసిస్టెంట్లకు పేస్కేల్‌ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్‌ ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఈజీఎస్‌ కింద విధులు నిర్వర్తిస్తున్న ఏపీవో, టెక్నికల్‌ అసిస్టెంట్‌, కంప్యూటర్‌ ఆపరేటర్లకు ప్రభుత్వం పేస్కేల్‌ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇందులోనే 18ఏళ్లుగా విధులు నిర్వర్తించిన వారితోపాటు ఫీల్డ్‌ అసిస్టెంట్లను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ మేనిఫెస్టోలో పొందుపరిచినట్లుగా ప్రభుత్వం ఫీల్డ్‌ అసిస్టెంట్లను లోక్‌సభ ఎన్నికలకు ముందే ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలని, ఈ నెల 6వ తేదీన జరిగే కేబినెట్‌ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరారు.

ప్రతిభావంతులకు ఆహ్వానం



బెల్లంపల్లి సీవోఈ బాలుర కళాశాల ముఖద్వారం

- సీవోఈ కళాశాలల్లో చేరికకు 4న ప్రవేశ పరీక్ష
- ఆదిలాబాద్‌ రీజియన్‌లో 14 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న విద్యార్థులు 5,918 మంది
- ఆన్‌లైన్‌లో అందుబాటులో హాల్‌టికెట్లు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో చేరికకు ఈ నెల 4న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. హాల్‌టికెట్‌లో ఏమైనా పొరపాట్లు దొర్లితే సదరు విద్యార్థులు సరైన ఆధారాలు తీసుకువచ్చి సరిచేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం పరీక్ష కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్‌ ఏర్పాటు చేస్తారు.

ఆదిలాబాద్‌ రీజియన్‌...

ఆదిలాబాద్‌ రీజియన్‌లో ఆదిలాబాద్‌, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14 పరీక్ష కేంద్రాలను గుర్తించారు. ఆదిలాబాద్‌ జిల్లాలో 4, కుమురం భీం జిల్లాలో 4 , మంచిర్యాల జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకులాల్లో ఏర్పాటు చేశారు. రీజియన్‌ వ్యాప్తంగా 5,918 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో బాలికలు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కేంద్రంగా బాలుర సీవోఈ కళాశాలలు ఉన్నాయి. సీవోఈ సెట్‌లో మెరిట్‌ ప్రాతిపదికన ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 సీవోఈ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. బాలబాలికలకు విడివిడిగా కళాశాలలు ఉన్నాయి. వీటిలో సీటు సాధించిన విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు భోజనం, వసతి, పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ ఉచితంగా అందజేస్తారు.

ఒక్కో సీటుకు 21 మంది పోటీ

సీవోఈ సెట్‌కు ఈసారి తీవ్ర పోటీ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా సీవోఈ కళాశాలల్లో 2006 సీట్లు ఉండగా 76,958 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇంటర్మీడియెట్‌ బోధనతో పాటు ఐఐటీ, నీట్‌ జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తుండడంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది సీవోఈ విద్యార్థులు 350 ఐఐటీ, 160 నీట్‌ సీట్లు సాధించారు. ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యాసంస్థల విద్యార్థులతో నేమఉజ్జీగా పోటీ పడుతూ జయకేతనం ఎగుర వేస్తుండటంతో సహజంగానే తల్లిదండ్రులు, విద్యార్థుల దృష్టంతా సీవోఈ కళాశాలల వైపు మళ్లుతోంది. ఒక్కో సీటుకు గరిష్టంగా 21 మంది విద్యార్థుల చొప్పున పోటీ పడుతుండటం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

పేద విద్యార్థుల కలలు సాకారం

నిరుపేద, అట్టడుగు వర్గాల విద్యార్థుల కలలను నెరవేర్చడంలో సీవోఈ కళాశాలలు దోహదం చేస్తున్నాయి. ఇందులో సీటు సాధించిన విద్యార్థులకు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో నెగ్గడానికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ బోధన సాగించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆ కోణంలోనే విద్యార్థులు ఐఐటీ, నీట్‌లో సీట్లు సాధించి డాక్టర్లు, ఇంజినీర్లు కావాలనే కలలు సాకారం చేసుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్‌టికెట్లను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో tsswreiajc.cgg.gov.in,www.tswreis.ac.in వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



సీవోఈ సెట్‌–2024 ఫస్ట్‌ లెవల్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ నెల 4న ప్రవేశ పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. రాష్ట్ర వ్యాప్తంగా 196 పరీక్ష కేంద్రాలు గుర్తించగా అందులో ఆదిలాబాద్‌ రీజియన్‌లో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రతీ పరీక్ష కేంద్రానికి చీఫ్‌ సూపరింటెండెంట్‌, డిపార్టుమెంటల్‌ అధికారులతో పాటు రాష్ట్ర పరిశీలకులను, ఇన్విజిలేటర్లను, తగినంత సిబ్బందిని నియమించాం.

– నక్రునాయక్‌, సంక్షేమ గురుకులాల జాయింట్‌ సెక్రటరీ

పునర్నిర్మాణ సభకు తరలివచ్చిన జనం



సభ స్థలానికి తరలి వస్తున్న జనం

ఇంద్రవెల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన కాంగ్రెస్‌ పునర్నిర్మాణ సభకు జనం భారీగా తరలివచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా నలుమూలల నుంచి జనం వేలాదిగా తరలిరావడంతో అమరవీరుల స్తూపం, సభ స్థలం జనసంద్రమైంది. కాంగ్రెస్‌ పునర్నిర్మాణ సభకు సుమారు 60 నుంచి 70వేల మంది రావడంతో ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ సమస్య రాకుండా జాగ్రతలు తీసుకున్నారు.

భారీ పోలీసు బందోబస్తు

సీఎం కేస్లాపూర్‌ నాగోబా ఆలయం, అమరవీరుల స్తూపం వద్దకు రావడంతో ఎస్పీ గౌస్‌ ఆలాం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగోబా ఆలయం నుంచి ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వరకు, స్తూపం పరిసర ప్రాంతంలో ఎలాంటి లవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

- సీఎంకు వినతిపత్రం అందించిన టీఏజీఎస్‌ రాష్ట్ర నాయకులు

ఎదులాపురం: తునికాకు సేకరణకు వెంటనే టెండర్లు పిలవాలని, పెండింగ్‌ బోనస్‌ తక్షణమే చెల్లించాలని కోరుతూ టీఏజీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్‌, ఉపాధ్యక్షుడు లంక రాఘవులు డిమాండ్‌ చేశారు. ఇంద్రవెల్లి సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ రెండవ పంటగా ఉందని, ఆకు సేకరణ ద్వారా 30వేల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఆకు సేకరణపై ఆధారపడి బీడీ పరిశ్రమ సైతం ఉందన్నారు. జిల్లాలో రెండు ఫారెస్ట్‌ డివిజన్‌లలో మొత్తం 25 యూనిట్లు ఉండగా ఆసిఫాబాద్‌ డివిజన్‌లో మైనింగ్‌ కవ్వాల్‌ టైగర్‌ కారిడార్‌ పేరుతో గతంలోనే ఆకు సేకరణ నిలిపివేశారని, గత సంవత్సరం 12యూనిట్లు కేవలం 2యూనిట్లకు మాత్రమే టెండర్లు వేశారని పేర్కొన్నారు. అలాగే కాగజ్‌నగర్‌ డివిజన్‌లో కడంబ టైగర్‌ కారిడార్‌ పేరుతో గత ఏడాది 13యూనిట్లకు 9 మాత్రమే టెండర్లు పిలిచారని, ఈ ఏడాది ఆకు సేకరణ పూర్తిగా నిలిపివేయాలనే ఆలోచనలో ఫారెస్ట్‌ డిపార్ట్‌మెంట్‌ ఉందన్నారు. ఆకు సేకరణ ఆధారపడి ఉన్న పేదల పొట్ట కొట్టవద్దని, తమరైనా స్పందించి పేదలకు ఉపాధిని అందించే తునికాకు సేకరణ యథావిధిగా కొనసాగేలా చూడాలని, టెండర్లు వెంటనే పిలవాలని సీఎంని కోరారు. 2016 నుంచి ఇప్పటి వరకు బోనస్‌ చెల్లించలేదని, చాలా మందికి ఇప్పటి వరకు బోనస్‌ అందలేదని, గత ఏడాది కొన్ని కల్లాల ఆకుల డబ్బులు రాలేదని ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పై సమస్యల వెంటనే పరిష్కరించాలని కోరారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిబూడిదైన ఆనందబాయి ఇల్లు

భైంసారూరల్‌: షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం మండలంలోని హజ్గుల్‌ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఆర్‌ఐ కృష్ణాగౌడ్‌ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆనందబాయి తడకలు, రేకులతో వేసిన ఇంట్లో నివసిస్తోంది. ఉదయం ఇంటికి తాళంవేసి బయటకు వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.30వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. ఆర్‌ఐ కృష్ణగౌడ్‌ పంచనామ నిర్వహించి సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు. తన వంతు నగదును ఆనందబాయికి అందజేశారు.

బాధితురాలికి అండగా ఉంటా..

హజ్గుల్‌ గ్రామంలో ఆనందబాయి అనే మహిళ ఇల్లు షార్ట్‌ సర్క్యూట్‌తో కాలిపోయిన విషయాన్ని తెలుసుకున్న మోహన్‌రావుపటేల్‌ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబీకులతో మాట్లాడి ఓదార్చారు. బాధిత కుటుంబీలకు మోహన్‌రావుపటేల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో అండగా నిలిచి నగదుతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. త్వరలోనే షెడ్డు నిర్మించి ఇస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు సుభాష్‌, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



అవినాష్‌ (ఫైల్‌)

గుడిహత్నూర్‌: వ్యాపారంలో నష్టం రావడంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని శాంతాపూర్‌ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సాబ్లే అవినాష్‌ (24) తన తండ్రికి ఉన్న ఐదెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తోడుగా సోయా, పత్తి, కందుల కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. ఈ వ్యాపారంలో నష్టాలు రావడంతో కొన్ని రోజులుగా మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకున్నాడు. తెల్లవారు జామున అవినాష్‌ సోదరుడు దేవ్‌సింగ్‌ ఇంట్లోకి వెళ్లగా అప్పటికే వేలాడుతున్న తమ్ముడిని కుటుంబ సభ్యుల సాయంతో కిందకు దించి చూడగా మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని రిమ్స్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య శిల్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్‌ తెలిపారు.

ప్రాణం తీసిన గుట్కా గొడవ

- తాగిన మైకంలో స్నేహితుడిపై దాడి
- ఆస్పత్రికి తరలించేలోగా మృతి



యోగేశ్‌(ఫైల్‌)

కుభీర్‌: తాగిన మైకంలో గుట్కా కోసం జరిగిన దాడిలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఎస్సై ఎండీ షరీష్‌ వివరాల ప్రకారం... మండలంలోని పల్సి గ్రామానికి చెందిన స్నేహితులు పురంశెట్టి యోగేశ్‌ (21), లాలాజీ రమేశ్‌ మేస్త్రీ పని కలిసి చేస్తుంటారు. శుక్రవారం ఉదయం ఇద్దరు కలిసి గ్రామంలోని తెల్ల కల్లు బట్టిలో కల్లు తాగి బయట కొచ్చారు. ఇంతలో రమేశ్‌ గుట్కా ఇవ్వమని యోగేశ్‌ను అడిగాడు. ఇవ్వకపోవడంతో యోగేశ్‌పై దాడిచేయగా కిందపడిపోయాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం భైంసా కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి లింగన్న ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

శాస్త్రీయ నృత్యంలో చిన్నారి ప్రతిభ



శాన్విని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని వాసవీ వరల్డ్‌ స్కూల్‌లో యూకేజీ చదువుతున్న మాల్వే శాన్వి శాస్త్రీయనృత్యంలో ప్రతిభ కనబరిచింది. గత నెలలో హైదరాబాద్‌లో మహర్షి మెగా డ్యాన్స్‌ కాంటెస్ట్‌ నిర్వహించగా అందులో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి జూనియర్స్‌ విభాగంలో ద్వితీయ బహుమతి పొందింది. వాసవీ వరల్డ్‌ స్కూల్‌ యాజమాన్యం శుక్రవారం శాన్వికి జ్ఞాపిక ఇచ్చి సత్కరించింది. ఇలాంటి నృత్య ప్రదర్శనలు మరెన్నో వేదికల మీద చేసి సంప్రదాయం విషయంలో రాణించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్‌ జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపల్‌ శైలాజాయ్‌సన్‌, పాట్రన్‌ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తానూరు: సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌ పాటిల్‌ పోలీసులకు సూచించారు. శుక్రవారం తానూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నమోదైన కేసులు, ఠాణాలోని సిబ్బంది వివరాలు ఎస్సై సందీప్‌ ద్వారా తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతంలో రాత్రి వేళ పెట్రోలింగ్‌ నిర్వహించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోలూరు జాతరలో బందోబస్తు ఏర్పాటు విషయమై అడిగి తెలుసుకున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్‌: కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్‌ ముండేను ఎంపీ సోయం బాపూరావు నేతృత్వంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఢిల్లీలో గురువారం కలిశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన జన్‌ మన్‌ పథకంలో ఆదివాసి గిరిజన గూడేలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందించారు. ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు బుర్సా పోచయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ఆదిలాబాద్‌: ఏపీలోని చీరాలలో నిర్వహించిన జాతీయస్థాయి షూటింగ్‌ బాల్‌ పోటీల్లో జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. జాతీయ స్థాయి సబ్‌ జూనియర్‌ విభాగంలో తెలంగాణ జట్టు ప్రథమ స్థానంలో నిలువగా జిల్లాకు చెందిన వంశీ, విజయ్‌ వంశీ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. ఇదిలా ఉండగా జూనియర్‌ బాలుర భాగంలో జిల్లా క్రీడాకారులు సెహ్వాగ్‌, మున్నా, మధుకర్‌, గణేశ్‌ రజత పతకాలు సాధించారు. అలాగే బాలికల సబ్‌ జూనియర్‌ విభాగంలో తెలంగాణ జట్టు 3వ స్థానంలో నిలవగా ఇందులో జిల్లా క్రీడాకారులు సహిస్రా, అక్షయ, సింధుజ, వైష్ణవి, రక్షిత కాంస్య పతకాలు అందుకున్నారు. జిల్లా క్రీడాకారులను డీఈవో ప్రణీత, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, రాష్ట్ర షూటింగ్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రవికుమార్‌, కోశాధికారి హరిచరణ్‌ అభినందించారు.

సీఎం నోట కుప్టి మాట

ఇచ్చోడ: సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి బహిరంగ సభలో శుక్రవారం కడెం వాగుపై కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటించడంతో మరోసారి కుప్టి నిర్మాణం తెరపైకి వచ్చింది. తొమ్మిదేళ్ల క్రితం నుంచి కుప్టి ప్రాజెక్టు నిర్మాణంపై అప్పటి ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు నీలినీడలు కమ్ముకొని నిర్మాణ పనులకు అడుగులు ముందుకు పడలేదు. కుప్టి వద్ద నిర్మించే ప్రాజెక్టు ఎన్నికల్లో హామీగానే నిలుస్తూ వచ్చింది. 2023 నవంబర్‌లో పీసీసీ చీఫ్‌ హోదాలో రేవంత్‌రెడ్డి బోథ్‌ మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో తమ పార్టీ అధికారంలో వస్తే కుప్టి వద్ద కడెం వాగుపై ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జిల్లా పర్యటనలో భాగంగా ఇంద్రవెల్లి బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కుప్టి వద్ద ప్రాజక్టు నిర్మిస్తామని తెలుపడంతో తొమ్మిదేళ్ల నుంచి ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్న రైతులు సీఎం ప్రకటనతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన మహాలక్ష్మి జాతర



పూజలు చేస్తున్న భక్తుల పూజలు

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవ సందర్భంగా రెండురోజులుగా కొనసాగుతున్న జాతర ఉత్సవాలు ముగి శాయి. శుక్రవారం జాతరకు మండలం నుంచే కాకుండా మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. భక్తులతో జాతరలోని దుకాణాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా అంతర్రాష్ట్ర మల్ల యోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. ప్రథమ విజేతకు రూ. 7,777, ద్వితీయ విజేతకు రూ.5,555 నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. ఎస్సై సందీప్‌ బందోబస్తు నిర్వహించారు. గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎంకు నాగలిని బహూకరిస్తున్న కాంగ్రెస్‌ యూత్‌ నాయకులు



సీఎంకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న మెస్రం వంశీయులు



సీఎం సభ ఏర్పాట్లు, భద్రతపై ఎస్పీతో మాట్లాడుతున్న ఐజీ తరుణ్‌ జోషి

సీఎం సభ సైడ్‌లైట్స్‌

- ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిర్వహించిన సభకు సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4గంటల 40 నిమిషాలకు చేరుకున్నారు.
- సభ ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులకు సభలో మాట్లాడే అవకాశం రాలేదు.
- ఉదయం 11 గంటలకే జనం సభా స్థలానికి చేరుకున్నారు. అయితే తాగునీరు లేక అవస్థలు పడ్డారు. వాటర్‌ ప్యాకెట్ల కోసం ఎగబడ్డారు. టెంట్లు వేయకపోవడంతో ఎండలోనే కూర్చున్నారు.
- వేదిక వద్ద ముందుగానే పార్టీ నాయకులు కూర్చొని ఉండగా, సీఎం వచ్చిన తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కుర్చీ లేకపోవడంతో సీఎం వెనుక నుంచి ఓ కుర్చీ తెప్పించి తన పక్కన వేయించారు.
- సభ ముగిసిన తర్వాత సీఎం హెలిప్యాడ్‌ వద్దకు వెళ్లే వరకు జనం సెల్‌ఫోన్లలో చిత్రాలను బంధించారు. హెలిక్యాప్టర్‌ ఎగురుతున్న సమయంలోనూ సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు.
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.
- డీజేలో సీఎం రేవంత్‌ పాటకు మహిళలతో పాటు హాజరైన జనం స్టెప్పులేస్తూ కేరింతలు కొట్టారు.
- సభ పూర్తయిన తర్వాత ఇంద్రవెల్లి నుంచి మంచిర్యాల, ఆదిలాబాద్‌ వెళ్లే మార్గంలో రోడ్లపై ట్రాఫిక్‌ సమస్య ఏర్పడింది. గంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. జనం ఇబ్బందులు పడ్డారు.
- నాగోబా ఆలయాన్ని దర్శించుకున్న సీఎంకు గిరిజన ఆచారాల ప్రకారం తలపాగా ధరింపజేశారు.

–ఆదిలాబాద్‌టౌన్‌